

శింగనమల చెరువు కింద బీడుగా మారిన పంట పొలాలు



ఎండిపోయిన పుట్లూరు మండలం కోమటికుంట్ల చెరువు

- ఐఏబీ తీర్మానాలకు విలువే లేదా..!
- నీటి మాటలా..? ఓటు మాటలా..?
- ఇన్నాళ్లూ లేనిది.. ఇప్పుడే ఎందుకు..?
- తెరపైకి శింగనమల నీటి వివాదం
- చెరువులకు నీరు జీవోపై గతంలో సంబరాలు
- వైసీపీది కపట నాటకమని విపక్షాల విమర్శలు

"శింగనమల నియోజకవర్గంలో జలరాజకీయం తెరపైకి వచ్చింది. రెండేళ్ల నుంచి నీటి సమస్య కొనసాగుతున్నా.. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆ అంశాన్ని ఇప్పుడు లేవనెత్తారు. సోషల్ మీడియా వేదికగా.. సొంత పార్టీ నాయకులపై ఆరోపణలు చేశారు. అధికారుల తీరును తప్పుబట్టారు. స్థానికంగా తేలాల్సిన అంశాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంలో పంచాయితీ పెట్టేలా చేశారని అన్నారు. అధికార పార్టీకి చెందిన పొరుగు నియోజకవర్గాలు, పొరుగు జిల్లా వారిపై ఆరోపణలు చేశారు. 'మా బ్యాగ్రౌండ్ విద్యాసంస్థలు. ఫ్యాక్షన్ కాదు. మేము ఎవరినీ తొక్కేయడం లేదు. మేము ఏమీ మాట్లాడకూడదంట. దళిత ఎమ్మెల్యేని కాబట్టే వారికి చులకన. అంగ బలం ఉన్న నాయకులకే అధికారులు నీటిని కేటాయిస్తున్నారు. అలాంటప్పుడు ఐఏబీ సమావేశాలు ఎందుకు..? చిన్న చెరువు.. ముకుందాపురం చెరువుకు నీరు విడుదల చేయమని కోరినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు..' అని ఆమె లైవ్‌లో విమర్శలు చేశారు.

ఇదంతా దేనికోసం..? నిజంగా నీటి హక్కు కోసమేనా..? అయితే.. ఈ నాలుగున్నరేళ్లు ఎందుకు గట్టిగా నిలదీయలేదు..? ఈ ఎన్నికల్లో జొన్నలగడ్డకు టిక్కెట్ లేదని వైసీపీ అధినాయకత్వం చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఇది సొంత పార్టీపై తిరుగుబాటా..? ఇలా.. అనేక చర్చలు జనంలో జరుగుతున్నాయి. 'మన నీటి హక్కులను కాపాడుకునేందుకు నియోజకవర్గంలోని రైతులు కలిసికట్టుగా మద్దతు ఇవ్వాలి' అని కూడా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కలిసికట్టుగా ఇప్పుడు ఎవరిపై పోరాడుతారు..? ఎన్నికలు ముంగిట్లో ఉన్నప్పుడు.. ఐదేళ్ల పాలన ముగిసిపోతున్నప్పుడు..!"

# నీరెంత..? నిజమెంత..?



జలవనరుల శాఖకు అందిన ఆదేశాల ఉత్తర్వు

**బుక్కరాయసముద్రం/శింగనమల, జనవరి 8**

ఏడాదిన్నర కిందట శింగనమల చెరువును లోకలైజేషన్ (శాశ్వత నీటి కేటాయింపు) చేస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చింది. దీంతో శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 45 చెరువులకు నీరు ఇవ్వనున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ జీఓ తేవడం కోసం తాము ఎంతో కష్టపడ్డామని స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి ఆర్భాటంగా ప్రకటించి, ఊరూరా సంబరాలు చేశారు. ఈమేరకు మరవకొమ్మదిన్నె వద్ద పైలాన్ కూడా ఆవిష్కరించారు. సాగునీరు వస్తే తమకష్టాలు తీరుతాయని రైతులు ఎంతో సంతోషపడ్డారు. అయితే ఆ జీఓ అమలైన దాఖలాలే కనిపించడం లేదు. ఈ జీవోపైన అధికారులు ఇప్పటి వరకు ఖచ్చితమైన సమాచారం చెప్పలేదు. కనీసం నియోజకవర్గంలో చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులు చేసింది లేదు. రాజకీయ ఆర్భాటం కోసమే స్థానిక ఎమ్మెల్యే జీవో తెచ్చారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

### ● ఇదీ జీఓ..

నియోజకవర్గంలోని 45 మైనర్, మేజర్ ఇరిగేషన్ చెరువులకు హంద్రీనీవా ద్వారా 1.35 టీఎంసీలు, శింగనమల లోకలైజేషన్ చెరువుకు 1టీఎంసీల నీరు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెంబర్1782, గెజిట్ నెం 638, జీవో ఆర్‌టినెం 249తో రెండు జీవోలు 2022 జూలై 19న ఇచ్చింది.

### ● పేరుకే లోకలైజేషన్

అనేక దశాబ్దాల హామీ తాము నెరవేర్చామని గొప్పలు చెబుతున్న వైసీపీ ఎమ్మెల్యే రాజకీయ ప్రచార ఆర్భాటం కోసమే శింగనమల లోకలైజేషన్ జీవో తెరపైకి తెచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హంద్రీనీవా ద్వారా నీటిని కేటాయిస్తూ ప్రభుత్వం 2022 జూలై19న జీవో ఇచ్చింది. అప్పుడు వర్షాలు బాగా రావడంతో చెరువులోకి నీరు చేరి మరువ పారింది. గతేడాది వరి పంట సాగు చేయడంతో ఉన్న నీరు మొత్తం పంటకు సరిపోగా కొద్ది నీరు మాత్రం మిగిలింది. ఇప్పుడు మళ్లీ పంట సాగు చేయడానికి రైతులు సిద్ధం కాగా, ప్రస్తుతం ఉన్న నీరు సరిపోదని, చెరువుకు నీరు వచ్చే పరిస్థితి కూడా లేదని, ఆరుతడి పంటలు వేసుకోవాలని కొందరు వైసీపీ నాయకులు చెబుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆధారంగా శింగమల చెరువుకు 1టీఎంసీ హంద్రీనీవా నీటిని విడుదల చేయాలి. అయితే ఇప్పటి వరకు చుక్క నీరు కూడా చెరువుకు రాలేదు. హంద్రీనీవా ద్వారా చెరువుకు నీరు వదలాలని రైతులు కోరితే... ఈ ఏడాది తాగునీటి కేటాయింపులకు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది చెరువు కింద ఉన్న 2500 ఎకరాలు బీడుగా మారాయి. దీంతో రైతులు జీవో పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### ● 45 చెరువులకు నీరు ఏదీ..?

ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆధారంగా నియోజకవర్గంలోని 45 చెరువుకు 1.35 టీఎంసీ నీరు ఇప్పటి దాకా చేరలేదు. జీవో కాపీలు పేపర్లకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం కొన్ని చెరువులో 30 నుంచి 40శాతం వర్షపు నీరు మాత్రమే ఉంది. మరో రెండు నెలలు గడిస్తే చెరువులు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. పుట్లూరు మండలంలోని చెరువులకు గండికోట రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందిస్తామన్నారు. ఇప్పటి వరకు చుక్క నీరు ఇవ్వలేదు. బుక్కరాయసముద్రం చెరువుతో పాటు మండలంలో మరో ఏడు చెరువులలో కూడా నీరు పూర్తిగా తగ్గిపోయింది.

### ● తిండి గింజలు, పశుగ్రాసానికి కొరత ఉండదు

శింగనమల చెరువు కింద 2500 ఎకరాలు అధికారికంగా, అనధికారికంగా మరో 2500 ఎకరాలు సాగు చేశారు. వరి పంట పండితే జిల్లాలో చాలా ప్రాంతాలకు తిండి గింజలు, పశుగ్రాసం కొరత ఉండదు. చెరువులో నీరు ఉంటే దాదాపు 40 గ్రామాలకుపైగా భూగర్భ జలాలు, తాగునీటి సమస్య ఉండదు. దాదాపు 200 కుంటుబాల మత్స్యకారులు జీవనోపాధి పొందుతారు.

### ● నీటిని వృథాగా వదిలేశారు

ఏడాది కిందట వర్షాలు బాగా రావడంతో చెరువులు పూర్తిగా నిండాయి. ఖరీఫ్ సాగు పేరుతో చెరువులో ఉన్న నీటిని వృథాగా వదిలేశారు. ఆయకట్టు కింద ఉన్న 2500 ఎకరాల్లో 500 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశారు. పంట సాగు చేసిన 500 ఎకరాల కోసం చెరువుకు ఉండే నాలుగు తూములను నాలుగు నెలలు పాటు ఎత్తి వేశారు. దీంతో దాదాపు 50శాతం నీరు బయటికి వెళ్లి పోయింది. కొందరు రైతులు నీరు వృథా పోతోందని, తూములు మూసివేయాలని బతిమాలినా పట్టించుకోలేదు. ప్రస్తుతం పంట సాగుకు నీరు లేక అవస్థలు పడుతున్నారు.

## నీరు ఏదీ?





నియోజకవర్గంలోని చెరువులు లోకలైజేషన్ చేస్తున్నట్లు జీవో ఇచ్చి ఉంటే నీరు విడుదల చేయాలి కదా? ఎందుకు విడుదల చేయలేదు. అంతా రాజకీయ ఆర్భాటమే. వాన నీరే చెరువుల్లో ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో నీటి కేటాయింపులు చేయలేదు. రైతులే తగిన బుద్ధి చెబుతారు.

**- ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, ద్విసభ్యకమిటీ సభ్యులు**

## కపట ప్రేమ



నియోజకవర్గంలో రైతుల పట్ల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కపట ప్రేమ చూపుతోంది. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆధారంగా నీటి కేటాయింపులు చేయాలి. నీటి కేటాయింపులు లేని జీవోలు ఎందుకు ఇవ్వాలి.

**- నల్లప్ప, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు**

## రైతులను మోసం చేసిన సీఎం



నియోజకవర్గంలో వేలాది మంది రైతులను ఉత్తుత్తి జీవోలత సీఎం జగన్ మోసం చేశారు. సాగు నీరు వస్తాయని రైతులు ఎంతో ఆశ పడ్డారన్నారు. అయితే చెరువులకు నీరు రాకపోవడంతో ఈ ఏడాది పంట పొలాలను బీడుగా మార్చుకున్నారు. రాజకీయ ప్రచారం కోసమే ఈ రెండు జీవోలు ఇచ్చారు. ప్రయోజనం లేని జీవోలు ఎందుకు?

**- నారాయణస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి**

## పంటకు సరిపడా నీరు తేవాలి



చెరువులో కొద్ది నీరు మాత్రమే ఉంది. 20 రోజుల్లో పంట సాగు చేయడానికి నారు పోయాలి. మా చెరువు లోకలైజేషన్ అయ్యిందని చెబుతున్నారు. పంటకు అవసరమైన నీరు ఎమ్మెల్యే ఇప్పిస్తే రైతులు పంటలు సాగు చేస్తారు. లోకలైజేషన్ అంటే మాకు నీటి వాట రావాలి కదా! అరుతడి పంటలు వేయమంటున్నారంటే అర్థమేంటి?

**- రైతు ఎర్ర చిన్న నాగముని, శింగనమల**

## నమ్మకం లేదు..



చాలా కాలం నుంచి ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికలలో హమీ ఇవ్వడం పరిపాటిగా మారిది. వైసీపీ కూడా గత సంవత్సరం లోకలైజేషన్ అంటూ ఆర్భాటం చేసింది. ప్రస్తుతం చెరువులో నీరు కొద్దిగానే ఉంది. పంటకు అవసరమైన నీరు వైసీపీ నాయకులు తెవాలి. కానీ లోకలైజేషన్ అంటే మాకు నమ్మకం లేదు.

**- రైతు మునెప్ప, శింగనమల**

## నీటి కేటాయింపులు ఎలా..?

శింగనమల చెరువుకు లోకలైజేషన్ అంటూ వైసీపీ నాయకులు గతంలో ఆర్భాటాలు చేశారు. చెరువుకు నీటిని ఎక్కడి నుంచి కేటాయిస్తారో చెప్పాలి. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ప్రచారం చేస్తాయే తప్ప ఆచరణలేదు.

**- నల్లప్ప, జిల్లా కేవీపీఎస్ నాయకుడు**

## కొత్త వాటికి కేటాయింపులు ఎక్కడ..?

శింగనమల చెరువుకు లోకలైజేషన్ అంటూ ఒక టీఎంసీ నీరు వస్తాయని ప్రచారం చేశారు. అయితే ఇప్పటికే గతంలో కేటాయింపు చేసిన చెరువులకే నీరు వదలలేదు. కొత్తగా శింగనమల చెరువుకు ఎక్కడ నుంచి తెస్తారు. రైతులను మభ్యపెట్టడానికే ఇలాంటి ఉత్తత జీవోలు ఇచ్చారేమో!

**- జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు**

# జగన్ ఇంటికెళ్లడం తథ్యం

**మాజీ మంత్రి పరిటాల సునీత**



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

**అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేశారని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. ప్రజల రక్తాన్ని పీలుస్తున్న జగన్ ప్రభుత్వం ఇంటికి వెళ్లక తప్పదని అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, వ్యవసాయరంగాన్ని ధ్వంసం చేశారని ఆమె జగన్ పాలనపై నిప్పులు చెరిగారు. రైతులను పూర్తి నిర్లక్ష్యం చేశారని, జగన్ పాలనలో బాగుపడిన రైతే లేరని అన్నారు. రాయలసీమ రైతులను జగన్ మోసగించారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వాటాతో కలిపి రూ.15 వేలు ఇచ్చి.. రైతులను ఏదో ఉద్ధరించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రస్థాయిలో పంటలు నష్టపోయారని, వారిని ఆదుకున్న పాపాన పోలేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని అన్నారు. పేరూరు ప్రాజెక్టుకు వర్షపు నీరు చేరినా.. పంటలకు ఇవ్వలేకపోయారని విమర్శించారు. నిరుద్యోగుల విషయంలో దారుణంగా వ్యవహరించారని అన్నారు. కరువు జిల్లాకు ఏ ఒక్క పరిశ్రమనూ తీసుకురాలేదని, రాయలసీమలో పరిశ్రమలు పెట్టాలంటే పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితికి వచ్చారని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి కారణంగా ఒకానొక దశలో కియ పరిశ్రమ వెనక్కు వెళ్లే పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు.. ఇలా అన్ని వర్గాలను జగన్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని, అందుకే ఆ వర్గాలన్నీ రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యుత్ చార్జీలు, పన్నుల పేరుతో ప్రజల రక్తాన్ని జగన్ పీల్చేస్తున్నారని అన్నారు. నవరత్నాల సాకుతో ప్రజలను అన్ని రకాలుగా దోచుకున్నారని అన్నారు. ప్రజల భూముల్లో జగన్ బొమ్మలు వేయడం, టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులేయడం మినహా చేసింది ఏమీ లేదని అన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ముఖ్యమంత్రి జగనేనని అన్నారు. మరో మూడు నెలలు ఆగితే టీడీపీ అధికారంలోకి వస్తుందని, తమ రాజధాని అమరావతే అని ప్రజలు గర్వంగా చెప్పుకునే పరిస్థితిని చంద్రబాబు తీసుకొస్తారని అన్నారు. వైసీపీ సర్వేల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నది స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు కావడం తథ్యమని అన్నారు. సమావేశంలో పార్టీ మండలాల కన్వీనర్లు జింకా సూర్యనారాయణ, ముత్యాలరెడ్డి, పోతులయ్య, నారాయణస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి రాగే మురళి, పాముురాయి రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఓటమికి కౌంట్‌డౌన్

● సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ● 28వ రోజు అంగన్‌వాడీల ఆందోళన

**అనంతపురం విద్య, జనవరి 8:** డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించిన వెంటనే సీఎం జగన్ ఓటమికి కౌంట్‌డౌన్ మొదలైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ హెచ్చరించారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు 28వ రోజు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగించారు. సీపీఐ, సీపీఎం, జనసేన, రైతు సంఘం నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలను అంగన్‌వాడీలు కన్నబిడ్డల్లా చూసి సేవలు చేశారని అన్నారు. తెలంగాణలో వేతనాలు పెంచినా ఇక్కడ పెంచకపోగా, నిరసనలు తెలుపుతున్న వారిపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. జగన్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు సజ్జల శకుని ప్రాత పోషిస్తున్నారని అన్నారు.

● కలెక్టరేట్ వద్ద ముట్టడిలో పాల్గొన్న మున్సిపల్ వర్కర్లు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించాలని అడుగుతుంటే ఎస్మా ప్రయోగించడం జగన్ చేతకాని తనానికి నిదర్శనమని విమర్శించారు. పది డిమాండ్లను పరిష్కరించామని మంత్రులు చెబుతున్నారని, ఇక ఆ ఒక్క డిమాండ్ ఏం పాపం చేసిందో చెప్పాలని ఎద్దేవా చేశారు. మహిళలు 28 రోజులుగా రోడ్డెక్కి నిరసనలు తెలుపుతుంటే ప్రజాప్రతినిధులు ఏ ఒక్కరూ వచ్చి పలకరించలేదని మండిపడ్డారు. రేపు ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని వచ్చి ఓట్లు అడుగుతారని నిలదీశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు దాదా గాంధీ, జనసేన నాయకులు బాబురావు, భవానీ రవికుమార్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు శకుంతల, రమాదేవి, జమున పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న సీపీఐ, సీపీఎం, జనసేన నాయకులు

సమాన వేతనం

# ఇచ్చేదాకా సమ్మె

స్పష్టం చేసిన మున్సిపల్ కార్మికులు

**అనంతపురం క్రైం, జనవరి 8**

సమాన పనికి సమాన వేతనం ఇచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లను అంగీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే సమ్మె ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ కార్మికులు

# సెంచరీతో చెలరేగిన దత్తారెడ్డి

**అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 8:** బీసీసీఐ ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న సీకే నాయుడు అండర్-23 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో జిల్లాకు చెందిన మచ్చా దత్తారెడ్డి సెంచరీతో చెలరేగాడు. ఆంధ్రా-గోవా జట్ల మధ్య జరుగుతున్న పోటీల్లో దత్తారెడ్డి 86 బంతుల్లో ఏడు ఫోర్లు, ఏడు సిక్సర్లతో 102 పరుగులు చేశాడు. దీంతో ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లకు 606 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. సెంచరీ సాధించిన దత్తారెడ్డికి జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు అభినందించారు.



# పల్లెకు పోదాం.. పండుగ చేద్దాం..

సంక్రాంతి సంబరాలు బడి సెలవులతో మొదలయ్యాయి. పల్లెల నుంచి నగరానికి వలస వచ్చినవారు సైతం సొంతూరి బాట పట్టారు. దీంతో అనంతపురం ఆర్టీసీ బస్టాండు సోమవారం కిటకిటలాడింది. బస్సుల్లో సీట్లు పట్టుకునేందుకు పోటీపడ్డారు. అన్ని డిపోల నుంచి ఆర్టీసీ 186 బస్సు సర్వీసులను నడుపుతోందని రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు 102 బస్సులు, పండుగ అనంతరం ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు తిరుగు ప్రయాణం కోసం 84 బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని, సాధారణ టికెట్ ధరలే ఉంటాయని, ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నవారికి 10శాతం రాయితీ ఇస్తామని తెలిపారు.



బస్సుల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

## నేటి నుంచి సంక్రాంతి సెలవులు

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు మంగళవారం నుంచి సంక్రాంతి సెలవులు ఉంటాయని ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ 10 రోజులపాటు పాఠశాల విద్యాశాఖ సెలవులు ప్రకటించిందని ఆయన తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలలు నిబంధనలు పాటించాలని సూచించారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**- అనంతపురం విద్య/కల్చరల్**







విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రద్దీగా ఆర్టీసీ బస్టాండు



బస్సుల్లో సీట్ల కోసం పాట్లు

# చేనేత బతికితేనే ధర్మవరం బతుకుతుంది

- సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమను కాపాడుతా
- అరాచకాలకు అడ్డుకట్టవేసి ధర్మవరాన్ని ప్రశాంతంగా ఉంచుతా
- పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో పరిటాల శ్రీరామ్

**ధర్మవరం, జనవరి 8:** చేనేత బతికితేనే ధర్మవరం బతుకుతుందనీ, లేదంటే తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలో ఐదు రోజులుగా చేపట్టిన పాదయాత్ర సోమవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంలో ఏ కాలనీలో చూసినా సమస్యలే కనిపించాయన్నారు. వార్డులోని ఒకటిరెండు వీధుల్లోనే అన్ని సమస్యలు వచ్చాయంటే, వార్డు మొత్తం చూస్తే ఇంకెన్ని ఉంటాయో అర్థమవుతోందని అన్నారు. గుడ్ మార్నింగ్ అంటే ఏదో మంచి జరుగుతుందన్న అభిప్రాయం బయట సమాజంలో ఉందని, వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోతే ఇక గుడ్‌మార్నింగ్ కార్యక్రమం ఎందుకని ఎమ్మెల్యే కేతిరెడ్డిని ఆయన ప్రశ్నించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాను దగ్గరనుంచి చూశానని,



సభకు హాజరైన జనం



బహిరంగ సభలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

కొంతమంది కార్మికులు తినడానికి తిండిలేదని చెప్పడం తనను కలిచివేసిందని అన్నారు. హ్యాండ్ లూమ్ ద్వారా నేసే చీరలకు వ్యాపారం బాగుండేలా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా ఒక కార్యక్రమానికి శ్రీకారం చుడతానని శ్రీరామ్ అన్నారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో కేతిరెడ్డి జోలెపట్టి కార్మికుల కోసం భిక్షాటన చేశారని, ఆ జోలెకు రంధ్రం పడిన విషయం అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. తాను అలా చేసే పరిస్థితి ఉండదని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల పిల్లలను ఆదుకునే విధంగా ఒక కమిటిని వేస్తానని తెలిపారు. ధర్మవరం ప్రాంతంలో మహిళలకు ఎక్కువ మందికి ఉపాధి లేకుండా పోయిందని, వారికి గార్మెంట్స్ పరిశ్రమలు కూడా తీసుకొస్తానని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులను బెదిరించి, వారిని రాజకీయాల్లోకి లాగుతున్నారని, ఒక పద్ధతి ప్రకారం కార్పొరేట్ దందా సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే అయ్యాక రాజకీయాలను రాజకీయాలుగా మాత్రమే చూస్తానని, వ్యాపారులను ఇబ్బంది పెట్టనని అన్నారు. పాదయాత్రలో తాను ముందు వెళ్తుంటే వెనక వైపు నుంచి కొందరు వైసీపీ వారు, నేర ప్రవృత్తి ఉన్న వారు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ధర్మవరంలో అరాచకాలకు ముగింపు పలుకుతానని, ఇన్ని రోజులు సాగించిన దందాలు ఇక ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు.

## గడ్డం సుబ్బుకు టీడీపీలో పెద్దపీట..!

- రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియామకం
- పార్టీ ఆవిర్భావం నుంచే క్రియాశీలక రాజకీయాల్లోకి..
- తెలుగు విద్యార్థిగా ప్రస్థానం



**అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ వస్తున్న గడ్డం సుబ్రమణ్యంకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పెద్దపీట వేసింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆయనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. తెలుగు విద్యార్థి విభాగంలో పనిచేయడంతో 1985లో తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఏడాది తిరక్కుండానే తెలుగు విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన పనితీరు గుర్తించి 1990లో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఆ తర్వాత 1994లో రాష్ట్ర యువత కమిటీలోకి తీసుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయనకు అవకాశం ఇచ్చారు. అలా టీడీపీలో విద్యార్థి, యువత విభాగాల్లో పనిచేసిన సుబ్రమణ్యంను పార్టీ కమిటీలో పెద్దపీట వేశారు. ఏకంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచే చురుకైన కార్యకర్తగా, నాయకుడిగా పనిచేస్తుండటంతో అటు నందమూరి, ఇటు నారా కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. మరోవైపు జిల్లాలో పరిటాల రవీంద్రతో గడ్డం సుబ్బుది విడదీయరాని బంధం. ఎన్టీఆర్ భర్తరఫ్ సమయంలోనూ జరిగిన అల్లర్లలో సుబ్రమణ్యం సబ్ జైలుకు వెళ్లి వచ్చాడు. పరిటాల రవీంద్ర హత్యానంతరం జరిగిన అల్లర్లలోనూ అప్పటి ప్రభుత్వం సుబ్రమణ్యంను ప్రధాన నిందితుడిగా చేర్చి జైలుకు పంపింది. ఈ క్రమంలోనే ఆయనకు పార్టీ అధిష్ఠానం రాష్ట్ర కమిటీలో చోటు కల్పించింది. కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, అధ్యక్షుడు అచ్చెన్నాయుడులకు సుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు.

## నీరు వదలకపోతే.. మీ ఉద్యోగాలు ఊడుతాయ్!

- శ్రీరామిరెడ్డి కార్మికులను హెచ్చరించిన ఈఈ
- కార్మికులతో చర్చలు విఫలం



కార్మికులతో చర్చలు జరుపుతున్న అధికారులు

**కళ్యాణదుర్గం, జనవరి 8:** 'నీరు వదలకపోతే... మీ ఉద్యోగాలు ఊడుతాయ్' అని శ్రీరామిరెడ్డి కార్మికులను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ కుమార్, డీఈ శ్రీనివాసులు, జేఈ లావణ్య హెచ్చరించారు. సోమవారం పట్టణ సమీపంలో ఉన్న శ్రీరామిరెడ్డి పంప్‌హౌస్ వద్ద కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మె వద్దకు అధికారులు బృందంగా వచ్చి రెండు గంటల పాటు చర్చలు జరిపారు. 'మొదట నీరు వదలండి, లేకపోతే ఉద్యోగాలు ఊడుతాయ్... మీ ఇష్టం' అంటూ బెదిరింపులకు దిగారు. కార్మికులు మాత్రం భయపడేది లేదని, తమ జీతాలు, పీఎఫ్‌లు ఇవ్వాలని పట్టుబట్టారు. ఫేస్-1లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇచ్చారని, ఫేస్-4లో కార్మికులకు జీతాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ఫేస్-4 కింద సుమారు 225 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా పోషించుకోవాలని అన్నారు. ఎన్నిరోజులైనా ఇలానే సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్మికులను బెదిరిస్తున్నారని సీఐటీయూ నాయకులకు సమాచారం అందించడంతో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు రాజ్‌మోహన్, జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ వచ్చి అధికారులతో చర్చలు జరిపారు. చర్చలు విఫలం అయ్యాయి. జీతాలు ఇస్తేనే, నీరు వదులుతామంటూ కార్మికులు తేల్చిచెప్పారు. అధికారులు చేసేదేమీ లేక ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందిస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## విజయవాడకు కలెక్టర్ గౌతమి

**అనంతపురం టౌన్, జనవరి 8:** ఓటర్ల ఫిర్యాదులు, ముసాయిదా ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలపై మంగళవారం విజయవాడలో కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ బృందం అన్నిజిల్లాల కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్షకు హాజరయ్యేందుకు కలెక్టర్ గౌతమి సోమవారం విజయవాడకు బయలుదేరారు. జిల్లా ఓటర్ల పరిస్థితి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించిన రికార్డులను ఆమె వెంట తీసుకెళ్లారు. జిల్లా ఎస్పీ కూడా వెళ్లినట్లు తెలిసింది. రెండురోజుల పాటు విజయవాడలో ఓటర్ల సమీక్షలో వీరు పాల్గొంటారు.

## డెంగీతో విద్యార్థిని మృతి



సంధ్య (ఫైల్)

**కణేకల్లు, జనవరి 8:** మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కురుబ సంధ్య(15) అనే పదో తరగతి విద్యార్థిని డెంగీ జ్వరంతో మృతి చెందింది. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సంధ్య పదిరోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ప్రకాష్, రత్నమ్మ బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలిక ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విద్యార్థిని మృతి పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సంతాపాన్ని తెలిపారు.

## పోలీసుల హత్య కేసులో మాజీ నక్సలైట్లు జైలుకు తరలింపు

**పావగడ, జనవరి 8:** పావగడ సరిహద్దు ప్రాంతం వెంకటమ్మనహళ్లి గ్రామంలో 2005 ఫిబ్రవరి 10వ తేదీన మావోయిస్టులు ఆరుగురు పోలీసులు, ఒక పౌరుడిని దారుణంగా కాల్చి చంపిన ఘటనలో ఐదుగురు మాజీ నక్సలైట్లను పావగడ పోలీసులు విచారణ చేపట్టి సోమవారం జైలుకు తరలించారు. కనగానపల్లి మండలానికి చెందిన గంతమర్రి నాగరాజు, తల్లిమడుగు రామ్మోహన్, ఓబులేసు, కోనేటిపాళ్యం అంజి, కోనాపురం పద్మలను గత శనివారం రాత్రి వెంకటమ్మనహళ్లి ఘటనకు సంబంధించి పావగడ పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో మధుగిరి డీఎస్పీ రామచంద్రప్ప, ఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో పూర్తి విచారణ చేపట్టిన అనంతరం పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి మున్సిఫ్ కోర్టులో హాజరు పరిచారు. 15 రోజులపాటు రిమాండ్‌కు తరలించేందుకు న్యాయాధికారులు ఆదేశించారు. వెంకటమ్మనహళ్లి ఘటనకు సంబంధించి పావగడ పోలీసులు అరెస్టు చేసిన రామ్మోహన్, నాగరాజు, ఓబులేసు, అంజి, పద్మ, వీరందరూ 2005 సంవత్సరానికి మునుపే పోలీసుల ఎదుట లొంగిపోయి ప్రభుత్వం నుంచి పలు సౌకర్యాలు పొందారని, అయినా కూడా 2005లో జరిగిన ఘటనలో వారిని ఇరికించడం దారుణం అని వారి బంధువులు ఆరోపించారు.

## నమ్మినవాళ్లను మోసగించావ్

### ఎమ్మెల్యే కాపుపై బంధువు మండిపాటు

**రాయదుర్గం, జనవరి 8:** 'ఎమ్మెల్యే అయ్యాక నమ్ముకున్నవాళ్లని మోసం చేశావ్. ఇసుక, మద్యం, డీజిల్‌ను అమ్మి దోచుకున్నావు' అని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై ఆయన తోడల్లుడు హంపారెడ్డి తనయుడు నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రాయదుర్గంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టిక్కెట్ ఇవ్వలేదన్న ఆక్రోశంతో సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు చేసిన కాపు, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. '2009లో రాయదుర్గానికి కొత్తగా వచ్చినపుడు నీకు ఆశ్రయం ఇచ్చి చేరదీస్తే- మమ్మల్నే గొంతు కోసిన ఘనుడవి నువ్వు' అని విమర్శించారు. '2019లో జగన్ టిక్కెట్ ఇచ్చి గెలిపిస్తే, కొద్దిరోజులకే కర్ణాటకకు టిప్పర్లతో ఇసుకను రవాణా చేసి అడ్డంగా దొరికావు. వాటిని విడిపించుకునేందుకు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగావు. ఎస్ఐని క్షోభకు గురిచేశావు. గెలిచినప్పటి నుంచి దోచుకోవడం మీదే దృష్టి పెట్టి.. కర్ణాటక నుంచి ఆర్టీసీకి డీజిల్‌ను కూడా అక్రమంగా సరఫరా చేశావు. చెప్పుకుంటూ పోతే నీ చిట్టా చాలా ఉంది' అని విమర్శించారు. 'నీకు టిక్కెట్ రానందుకు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు సంతోష పడుతున్నారు. జగన్‌ను పొగడుతున్నారు. నువ్వు చేసిన వసూళ్లు, అక్రమాలు ఒక్కొక్కటిగా సీఎం జగన్ నీ ముందు చెబుతుంటే తలదించుకున్న మాట వాస్తవమా కాదా? నీ మనస్సాక్షికి సమాధానం చెప్పుకో..' అని అన్నారు. 'పార్టీ గొంతు కోసిందని చెబుతున్న నువ్వు.. ఇక్కడ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంతమంది జీవితాలను నాశనం చేశావో ఎవరిని అడిగినా చెబుతారు. ఇంకోసారి జగన్ గురించి మాట్లాడితే పూర్తి చిట్టా విప్పి జనం ముందు పెడతాం' అని హెచ్చరించారు.

## ముస్లింలకు జగన్ తీరని ద్రోహం

- ఎన్నికల్లో ముస్లింల ఓట్లే నిర్ణయాత్మకం
- శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్

**గుంతకల్లు, జనవరి 8:** మైనార్టీల ప్రభుత్వం అంటూ మోసకారి మాటలు పలికి అధికారంలోకి వచ్చిన జగన్ ముస్లింలకు తీరని ద్రోహం చేశాడని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. సోమవారం ఉదయం గుంతకల్లులో నిర్వహించిన నియోజకవర్గ ముస్లిం ఆత్మీయ సదస్సుకు షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే దుల్హన్ పథకాన్ని నీరుగార్చారన్నారు. ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ చాపచుట్టేసి ముస్లింలకు తీరని అన్యాయం చేశారన్నారు. ముస్లిం హక్కులకు భంగం కలిగించిన ఎన్ఆర్సీ, సీఏఏ, తదితర చట్టాల విషయంగా బీజేపీ అడుగులకు జగన్ మడుగులొత్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు వైసీపీకి వ్యతిరేకంగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముస్లింలు 50 నియోజకవర్గాల్లో, 8 పార్లమెంటు స్థానాల్లో తమ ప్రభావాన్ని చూపగలరన్నారు. టీడీపీ హయాంలో 36 వేల మందికి దుల్హన్ పథకాన్ని వర్తింపజేయగా, జగన్ కేవలం 3 వేల మందికి రూ.50 వేల ఆర్థికసాయం ఇచ్చారన్నారు. దుల్హన్ స్కీంను రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతానని హామీ ఇచ్చి తుంగలో తొక్కారన్నారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చి, చివరకు మైనార్టీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా, నూర్ బాషా సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ షెక్షావలి, మైనార్టీ నేతలు సాలార్ బాషా, గౌస్ మోదిన్, పర్వీన్ తాజ్, కేసీ హరి, గుత్తి జిలాన్ బాషా, పామిడి గౌస్ పీరా, మహమ్మద్ షరీఫ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



ముస్లిం ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

## జగన్ హామీలు 730.. అమలైంది 15 శాతమే..

- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



**పుట్టపర్తి, జనవరి 8:** వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు 730 హామీలిచ్చి, అందులో కేవలం 15 శాతం హామీలు అమలు చేశారని మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో గొప్పలు చెప్పి, మడమ తిప్పాడని ఎద్దేవా చేశారు. మద్య నిషేధమంటూ తన ఐదేళ్ల పాలనలో రూ.36వేల కోట్లు జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది 5 లక్షల గృహాలని చెప్పి, కనీసం వేలల్లో కూడా పూర్తి చేయలేదన్నారు. 3,500మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతులను రైతు భరోసా పేరుతో ఆదుకున్నది శూన్యమన్నారు. 25మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వచ్చి ప్రత్యేక హోదా ఇస్తానని గొప్పలుచెప్పి, తన కేసులు మాఫీ కోసం తాను కేంద్రం ముందు మెడలు వంచారని ఏద్దేవా చేశారు. ఇసుక, సిమెంటు, నిత్యావసర వస్తువులు, కూరగాయాలు, చివరికి మద్యం ధరలు పెంచి సామాన్యులకు గుదిబండగా మారాడన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌తో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి గాలికొద్దిలేశారని చెప్పారు. చంద్రబాబు రూ.రెండువందల పింఛన్‌ను రెండువేలు చేస్తే, తాను రూ.3వేలు ఇస్తానని, మోసం చేసి, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రూ.3 వేలు ఇచ్చి గొప్పలు చెబుకోవడంమాట తప్పడమే అన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పింఛన్ల పంపిణీలో సంస్కారం మరచి విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల పాలనలో రోడ్డు గుంతపూడ్చలేదు. గంప మట్టి వేయలేదు. 193 చెరువులకు హంద్రీనీవా నీటితో నింపుతామని చెప్పిన మాట ఏమైదని ప్రశ్నించారు. సమావేశంలో రామాంజనేయులు, జాకీర్ అహమ్మద్, దేవానంద రెడ్డి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ పాల్గొన్నారు.

# ఇది ప్రభుత్వ కుట్ర..!

- స్వాతంత్ర్య సమరయోధుడికి అవమానం
- రెడ్లే కాదు.. అన్నివర్గాల ప్రజలూ తిరగబడతారు
- జగన్ ప్రభుత్వానికి ఏపీ రెడ్డి సంఘం హెచ్చరిక
- ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణకు అడ్డంకులపై ఆగ్రహం

**అనంతపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఈ పేరు తెలియని వారెవరూ ఉండరు. ఆయనో స్వాతంత్ర్య సమరయోధుడు. రెడ్డి సామాజికవర్గం ఆ మహనీయుడిని రియల్ హీరోగా చూస్తుంది. సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ ప్రభుత్వానికి చెమటలు పట్టించిన తెలుగువీరుడు ఉయ్యాలవాడ. అలాంటి మహనీయుడి కాంస్య విగ్రహాన్ని అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం నేతలు భావించారు. కాంస్య విగ్రహాన్ని తయారు చేయించారు. విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ముహూర్తం నిర్ణయించారు. కానీ విగ్రహావిష్కరణను పోలీసులు అడ్డుకున్నారు. దీని వెనుక ప్రభుత్వ ఆదేశాలున్నాయా..? అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు పనిచేశాయా..? అన్న చర్చ జరుగుతోంది. ఇది ప్రభుత్వ కుట్ర అని రాయలసీమ పోరాటసమితి కన్వీనర్, రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి సామాజికవర్గానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణకు రెడ్డి సామాజికవర్గం ప్రజాప్రతినిధులు రాకపోగా, పోలీసుల చేత విగ్రహావిష్కరణను అడ్డుకోవడం రెడ్డి జాతికే అవమానమని ఆయన అన్నారు. ఈ వ్యవహారం రెడ్డి సామాజికవర్గంలో ఆగ్రహానికి కారణమైంది. మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రభుత్వం, పోలీసులపై మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు రెడ్డి సంఘం నేతలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం దిగొచ్చి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా ఉంటేసరి, లేదంటే రాబోయే ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు.

### నిరంకుశత్వానికి నిదర్శనం..



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడం సీఎం జగన్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను వీధుల్లో ఏర్పాటు చేయడాన్ని అడ్డుకోని పోలీసులు, ప్రభుత్వం.. స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహావిష్కరణకు అడ్డు చెప్పడం దారుణం. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణను అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నాం. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే... రెడ్డి సామాజికవర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజలు తిరగబడే రోజులు వస్తాయి. ఇది ఒక రెడ్డి సామాజికవర్గానికి చెందిన అంశం కాదు. దేశ ప్రజలకు సంబంధించిన అంశం.

**- కేశవరెడ్డి, అనంతపురం**

### అవమానించడమే..



దేశ స్వాతంత్ర్య పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి. ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని రెండు నెలలుగా నగరంలో పనులు చేస్తున్నాం. ఇన్నాళ్లూ ప్రభుత్వం, పోలీసులు ఎటువంటి నోటీసు ఇవ్వలేదు. అన్ని రకాల అనుమతులు తీసుకుని ఉయ్యాలవాడ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందులో దాపరికం, రహస్యం ఏమీ లేదు. రెండు నెలల కాలంలో స్పందించని పోలీసులు, విగ్రహావిష్కరణ రోజున మమ్మల్ని అరెస్టు చేసి, అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. విగ్రహావిష్కరణను అడ్డుకోవడం పట్ల అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి విగ్రహావిష్కరణను అడ్డుకోవడమంటే ఆయనను అవమానించడమే.

**- గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

### వివాదం చేయడం తగదు..



కుల, మత, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ చేపట్టాం. దీన్ని వివాదం చేయడం తగదు. ఎంతో మంది నాయకుల విగ్రహాల ఏర్పాటుకు లేని సమస్య ఉయ్యాలవాడ విగ్రహం ఏర్పాటుకే ఎందుకు వచ్చింది..? రాజకీయ నాయకులు, అధికారులు సమష్టిగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అలాకాకుండా విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. రెండు మూడు నెలలుగా ఉయ్యాలవాడ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రెడ్డి సంఘం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం విగ్రహావిష్కరణ చేయాలని నిర్ణయించారు. ఇంతలో విగ్రహాన్ని ఆవిష్కరించకుండా వారించడం రెడ్డి సామాజికవర్గాన్నే కాదు.. అన్ని వర్గాల ప్రజలను బాధిస్తోంది.

**- రాజశేఖర్‌రెడ్డి, ఏపీ రెడ్డిసంఘం నాయకుడు**

## దేవుడి భూమికే ఎసరు!

- అధికార పార్టీ నాయకుడి పేరిట ఆన్‌లైన్
- రీ సర్వేతో బట్టబయలు.. గ్రామస్థుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

**కళ్యాణదుర్గం, జనవరి 8:** అధికార పార్టీ నాయకుడు దేవుడి భూమికే ఎసరు పెట్టాడు. భూముల రీ సర్వేతో ఈ అక్రమాల తతంగం బయటకు పడడంతో గ్రామస్థులే అవాక్కయ్యారు. మా గ్రామ దేవుడి భూమిని కాపాడాలంటూ సోమవారం కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు బైఠాయించారు. మాకు న్యాయం కావాలి, మా దేవుడి భూమిని కాపాడాలంటూ నినాదాలు చేశారు. కంబదూరు మండల పరిధిలోని కె.కొత్తూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమికి సంబంధించి సర్వే నెంబర్ 304లో 3 ఎకరాల 57 సెంట్ల భూమిని ఈ గ్రామానికి ఓ వ్యక్తి అధికార దర్పాన్ని, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఆక్రమించాడని గ్రామస్థులు ఆరోపించారు. అంతటితో ఆగకుండా వెబ్‌ల్యాండ్‌లోకి కూడా ఈ భూమిని తన పేరుమీద మార్చుకున్నాడని వాపోయారు. సబ్ డివిజన్ లేకున్నా అదనంగా అదే సర్వే నెంబర్‌కు మరొక లెటర్‌ను సృష్టించి భూమిని వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించుకున్నారని తెలిపారు. ఇదంతా నెలరోజుల క్రితం గ్రామంలో రీసర్వే చేస్తున్నప్పుడు ఈ తతంగం బయటకు పడిందన్నారు. డిసెంబరు 18న కంబదూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట కూడా ఆందోళన చేశామన్నారు. తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, ఆర్ఐ కిరణ్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వాపోయారు. వారు కూడా ఇంతవరకు న్యాయం చేయకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. ఆదివారం రాత్రి ఈ సమస్యపై గ్రామంలో దండోరా వేయించి, కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయానికి తరలిరావాలని పిలుపునివ్వాలని చూస్తే, దండోరా వేసే వ్యక్తినే అధికార పార్టీ నాయకులు భయపెట్టించారని ఆరోపించారు. దీంతో పక్క గ్రామమైన కర్తనపర్తి నుంచి దండోరా వేసే వ్యక్తిని పిలిపించి గ్రామంలో వేయించామన్నారు. అనంతరం సమస్యపై ఆర్డీవో రాణిసుష్మితకు వినతి పత్రం అందచేశారు. ఆర్డీవో స్పందించి గ్రామంలోకి వచ్చి విచారించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

- తీర్పు వెల్లడించిన జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

**అనంతపురం క్రైం, జనవరి 8:** శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామ ఎస్సీ కాలనీలో జరిగిన పాలాకుల చిన్నచౌడయ్య అలియాస్ చౌడప్ప హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఈ మేరకు సోమవారం ఏ1 పాలాకుల సూర్యనారాయణ, ఏ2 పాలాకుల పెద్దన్న, ఏ3 పాలాకుల రామాంజనేయులు, ఏ5 పాలాకుల రామాంజినమ్మకు కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ముద్దాయిల తల్లి పాలాకుల సాలమ్మపై నేరం రుజువు కానందున ఆమెపై కేసు కొట్టివేశారు. కేసు పూర్వాపలాలిలా ఉన్నాయి. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామ ఎస్సీ కాలనీలో చిన్నచౌడప్పకు హత్య చేసిన ముద్దాయిలు సూర్యనారాయణ, పెద్దన్న, రామాంజనేయులు, రామాంజినమ్మ స్వయాన పెదనాన్న కుమారులు, కుమార్తె. సాలమ్మ.. మృతుడికి పెద్దమ్మ. ఎస్సీ కాలనీలోని మృతుని అన్న ఆదినారాయణ, ముద్దాయిల అక్క రామాంజినమ్మ ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇళ్ల దగ్గర ప్రతి చిన్న విషయానికి రామాంజినమ్మ, ఆదినారాయణ భార్య శ్యామలతో గొడవ పడేది. తరచూ ఇలా జరిగే క్రమంలో శింగనమల పోలీస్‌స్టేషన్‌లో ఇరుపక్షాలు కేసులు పెట్టుకున్నారు. 2018 ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి వద్ద పేడ అలుక్కునే విషయంలో రామాంజినమ్మ, శ్యామలతో గొడవ పడింది. శ్యామల, ఆమె భర్త నారాయణ.. రామాంజినమ్మను తిట్టాడు. అదే విషయాన్ని రామాంజినమ్మ తన తమ్ముళ్లయిన సూర్యనారాయణ, రామాంజనేయలు, పెద్దన్నకు తల్లి సాలమ్మ చెప్పి వాళ్లను ఏదో ఒకటి చేయకపోతే తాను అక్కడ ఉండలేనని తమ్ముళ్లను, అమ్మను రెచ్చగొట్టింది. 7 గంటల సమయంలో వారందరూ కొడవండ్లు, కట్టె, రోకలిబండ తీసుకుని ఆదినారాయణ, శ్యామల ఇంటి ఎదుట రోడ్డుపై నిలబడి ఉండగా ఆదినారాయణపై దాడి చేశారు. శ్యామల అడ్డురాగా ఆమెను సాలమ్మ కొట్టింది. వారిని అడ్డుకునేందుకు ఆదినారాయణ తమ్ముడు చిన్న చౌడయ్య అడ్డురాగా అతనిని కొడవలితో నరికి, రోకలిబండతో కొట్టడంతో కిందపడ్డాడు. చిన్నచౌడప్ప భార్య అడ్డురాగా ఆమెను పక్కకు తోసి కింద పడిన చౌడప్పను సూర్యనారాయణ, రామాంజనేయులు, సాలమ్మ.. అతని కాళ్లు, చేతులు పట్టుకోగా పెద్దన్న కొడవలితో చిన్న చౌడప్ప గొంతు కోశాడు. చౌడప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శింగనమల పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరిపిన అప్పటి సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ చార్జిషీటు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదించారు. జిల్లా కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున 10మంది సాక్షులను విచారించారు. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో నలుగురికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు.


గద్దం సుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శికి పలువురి అభినందనలు

**అనంతపురం అర్బన్, జనవరి 8:** టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన గద్దం సుబ్రహ్మణ్యం నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు గాజుల ఆదెన్న, రాయల్ మురళి, దండు శ్రీనివాసులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## జగన్‌రెడ్డీ.. హామీలు నెరవేర్చాలి

జనసేన నాయకుల డిమాండ్


సమగ్రశిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న జనసైనికులు

**అనంతపురం విద్య / ప్రెస్‌క్లబ్, జనవరి 8:** సమగ్రశిక్ష ఉద్యోగులకు, అంగన్‌వాడీ లకు సీఎం జగన్ ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలని జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ డిమాండ్ చేశారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు, అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను సోమవారమూ కొనసాగించారు. దీనికి జనసేన, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భవానీ రవి కుమార్ మాట్లాడుతూ... శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం బెదిరింపులకు దిగడం హేయమన్నారు. అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగం చేయడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులకు జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ, వీర మహిళల దాసరి సరిత, సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ పాల్గొన్నారు.

## 'కేఎస్ఎన్'లో అక్రమాలపై విచారణ జరపండి

స్పందనలో జేసీకి విద్యార్థి సంఘాల ఫిర్యాదు


జేసీకి వినతి పత్రం ఇస్తున్న తెలుగు యువత నాయకులు

**అనంతపురం టౌన్, జనవరి 8:** స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరిగిన కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయప్ప తదితరులు జేసీ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. 535 మంది విద్యార్థులతో ఒక్కొక్కరి నుంచి రూ1000 వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమచేయలేదని, సీసీ కెమెరాల పేరుతో రూ20 లక్షలు అవినీతి జరిగిందని ఆరోపించారు. అభివృద్ధి పనుల పేరుతో రూ 40 లక్షలు కళాశాల సొమ్మును ఓ కాంట్రాక్టర్‌కు ఇచ్చారని, ఇందులో కూడా అవినీతి జరిగిందని ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు వచ్చే హాస్టల్ ఫీజుల్లో కూడా అక్రమాలు జరిగాయని, వీటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.

**స్పందనకు 450 ఫిర్యాదులు**: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు మొత్తం 450 ఫిర్యాదులు అందాయి. బాధితుల నుంచి జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టరు ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకరరావు ఫిర్యాదులు స్వీకరించారు.

### యువతను ఆదుకోండి : తెలుగు యువత నాయకులు

**అనంతపురం అర్బన్**: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని తెలుగు యువత నాయకులు జేసీ కేతన్‌గార్గ్‌ను కోరారు. సోమవారం స్పందనలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడుపూటి నారాయణస్వామి జేసీకి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగయువతను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ శాఖల్లోకి ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలను అరికట్టేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు నారాయణస్వామి, నరేష్, వేణు, సరిపూటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఉపాధి పనులు కల్పించండి

**అనంతపురం క్లాక్‌టవర్** : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు స్థానికంగా పనులు కల్పించి వలసలు నియంత్రించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ గాయత్రిదేవిను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, రాము, తిరుపతయ్య పాల్గొన్నారు.

### నిరుపేదలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

**నార్పల :** నార్పల మండంలోని నిరుపేదలకు ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వాలని సోమవారం సీపీఐ నాయకులు గంగాధర్ ఆధ్వర్యంలో తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. రేషన్ దుకాణాల ద్వారా కందిబాళ్లు పంపిణీ చేయాలని, కూతలేరు బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దపెద్దయ్య, నాగరాజు, సుధాకర్, శీనా పాల్గొన్నారు.

## సూపర్‌స్పెషాలిటీలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు

**అనంతపురం టౌన్, జనవరి 8** : సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు రోగులకు అందుబాటులోకి వస్తున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇకనుంచి ప్రతి సోమ, మంగళవారాలు ఆ డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు ఓపీ వైద్యసేవలు అందిస్తారని, ఈ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి చేరిక

**చెన్నేకొత్తపల్లి, జనవరి 8:** మండలంలోని చిన్నంపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంప్ కార్యాలయంలో సోమవారం చిన్నంపల్లి గ్రామానికి చెందిన బొగ్గుశ్రీరాములు, బొగ్గు నరసింహులు, గొల్లదామోదర్, ముత్యాలప్ప తదితరులు టీడీపీలోకి చేరారు. పరిటాల సునీత వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, నాయకులు అంకే అమరేంద్ర, మాడెం సూర్యనారాయణరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రమణ, శెట్టిపల్లెప్ప, నాగార్జున, రాజు పాల్గొన్నారు.

**నేడు బండమీదపల్లికి మాజీ మంత్రి రాక**

**రాప్తాడు** : మండలంలోని బండమీదపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు నిర్వహించే బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.


పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న దండు శ్రీనివాసులు, కనగానపల్లి తెలుగు యువత నాయకులు

## పరిటాల శ్రీరామ్ పాదయాత్రకు సంఘీభావం

**శింగనమల, జనవరి 8:** ధర్మవరంలో పరిటాల శ్రీరామ్ చేపట్టిన పాదయాత్రలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సోమవారం పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, మాజీ ఎంపీటీసీ కుళ్లాయప్ప, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, బండి పరుసురాం, బెస్తనారాయణస్వామి, తలారి తిప్పన్న, పవన్, దండు సతీష్, రంగస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

**ధర్మవరంరూరల్** : పరిటాలశ్రీరామ్ చేపట్టిన ప్రజా చైతన్యయాత్రలో కనగానపల్లి మండల తెలుగు యువత నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత మాజీ మండల అధ్యక్షుడు మనోహర్‌నాయుడు, గిరిశాల కుమార్, అర్జున్, పసల ఈశ్వర్, బట్టాధనుంజయ్, శ్రీహరి పాల్గొన్నారు.

## ఎస్మాకు భయపడం : అంగన్‌వాడీలు

**శింగనమల/ గార్లదిన్నె :** ప్రభుత్వం ఎస్మా గెజిట్ జీవోకు భయపడే ప్రసక్తే లేదని అంగన్వాడీలు హెచ్చరించారు. అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. శింగనమలలో సీఐటీయూ నాయకుడు భాస్కర్ ఆధ్వర్యంలో గెజిట్ జీవో 2 ప్రతులను దహనం చేశారు. గార్లదిన్నెలో అంగన్వాడీల సమ్మెకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మద్దతు తెలిపారు. జీవో ప్రతులను భోగిమంటల్లో అంగన్‌వాడీలు దగ్ధం చేశారు. ఇందులో అంగన్‌వాడీల ప్రాజెక్టు కోశాధికారి లీలావతి, గార్లదిన్నె, కల్లూరు సెక్టార్లు ఫిర్‌దోజ్‌బాను, రాజేశ్వరీ, ప్రమీలరాణి, శాంతకుమారి పాల్గొన్నారు.



శింగనమలలో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు, గార్లదిన్నెలో సంఘీభావం తెలుపుతున్న రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

## నగర వనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : డీఎఫ్ఓ


డీఎఫ్ఓ వినీత్ కుమార్

**అనంతపురం న్యూటౌన్, జనవరి 8:** జిల్లాలో నగర వనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు నూతన డీఎఫ్ఓ వినీత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పంపనూరు వద్ద ఉన్న నగర వనంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. దాన్ని ఒక పర్యాటక కేంద్రం తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుం టామన్నారు. అదేవిధంగా జిల్లాకు మరో రెండు నగర వనాలు మంజూరయ్యాయని, వాటిని కళ్యాణ దుర్గం, రాయదుర్గంలో ఏర్పాటు చేస్తామని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మొక్కలు నరకరాదని, వణ్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని అన్నారు.

## సైకో రెడ్డిని రైతులు క్షమించరు : ఆలం

**నార్పల, జనవరి 8:** సైకో జగన్‌రెడ్డిని రైతులు క్షమించరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు పేర్కొన్నా రు. సోమవారం స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రమే దేశంలో మొదటి స్థానంలో ఉందని, ఈ ఘనత సైకోరెడ్డికే దక్కిందని ధ్వజమెత్తారు. కనీసం రైతులకు డ్రిప్ సబ్సిడీలు కూడా ఇవ్వలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ ఈ అరాచక పాలనను తరిమికొట్టడానికి సిద్ధం కావాలని అన్నారు.

## కరోనా పాజిటివ్ కేసులు నిల్

**అనంతపురం టౌన్, జనవరి 8** : జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు సోమవారం నమోదు కాలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు ఆస్పత్రికి వచ్చిన 13 మంది అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా.. అందరికి నెగిటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు.

## విలేకరులపై దాడి చేసిన వారిని శిక్షించాలి : సీపీఎం

**అనంతపురం కల్చరల్, జనవరి 8:** ఉరవకొండలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సందర్భంగా పత్రికా విలేకరి, ఫోటోగ్రాఫర్‌పై దాడిచేసిన వైసీపీ వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వార్తల్లో తప్పులుంటే చట్టప్రకారం ఎదుర్కోవాలే తప్ప భౌతికదాడులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు.

## శాస్త్రోక్తంగా కుంభాభిషేకం

**అనంతపురం కల్చరల్, జనవరి 8:** మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి సోమవారం కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్వజస్తంభానికి కలశస్థాపన చేసి,కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటస్వామి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సురేష్, అశ్వత్థమ్మ పాల్గొన్నారు.

## నేడు ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు

**అనంతపురం టౌన్, జనవరి 8:** జిల్లాలోని 15 మండలాలల్లో మంగళవారం ఆరోగ్యసురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అనంతపురంరూరల్-2 ,తలుపూరు, సంతేకొండాపురం, రెడ్డిపల్లి-2, డీ హీరేహాల్-1, పాత కొత్తచెరువు, భద్రహల్లి, కోకుర్తి, ఇప్పేరు, బండ్లపల్లి, మల్లాపురం, ములకలేడు, చుక్కలూరు-2, అమిద్యాల, యాడికి వైఎస్సార్‌విలేజ్ క్లినిక్‌లలో క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.

## కన్‌స్ట్రక్షన్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు

**అనంతపురంరూరల్, జనవరి 8:** పలు కన్‌స్ట్రక్షన్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టరింగ్ వర్క్, సిరామిక్ టైలింగ్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ మౌల్డింగ్ తదిర టెక్నాలజీస్‌పై ఉద్యోగ అవకాశలు కల్పిస్తామని తెలిపారు. 8వ తరగతి, ఆపై చదివిన 21 నుంచి 45 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు బేసిక్ ఇంగ్లీష్ వచ్చి ఉండాలన్నారు. ఇజ్రాయిల్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 99888 53335ను సంప్రదించాలన్నారు.

## చేనేత వృత్తిపై విద్యార్థులకు అవగాహన

**గార్లదిన్నె, జనవరి 8:** మండలంలోని మర్తాడు లో చేనేత వృత్తి మగ్గాలపై ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ కోర్సులో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. వస్త్రాలు ఏ విధంగా తయారు చేస్తారు... ఏఏ మెటీరియల్ వినియోగిస్తారు.. తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, ఒకేషనల్ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, శివయ్య, వెంగమనాయుడు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

గార్లదిన్నె మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో ఏడీఏ వెంకట్రాముడు సోమవారం తనిఖీ చేశారు. గార్లదిన్నెలో మణికందన్ షాపుల్లో అనుమతి లేని దాదాపు రూ. 1,77,323 విలువ చేసే 1,694 కేజీల ఎరువులను సీజ్ చేశారు. అనంతరం పలు దుకాణాల్లో వివిధ రికార్డులను, స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

**అనంతపురంరూరల్ :** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఏ కార్యాలయం ఆవరణంలో సోమవారం నిర్వహించారు. దీనికి డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, అడిషన్ పీడీ సుధాకర్, డీవీఓ రమణారెడ్డి హాజరయ్యారు. మండలంలో 2022 ఏప్రిల్ 1వ తేది నుంచి 2023 మార్చి ఆఖరి వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రిమార్కులను నమోదు చేశారు. అందుకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఏపీడీఓ పుల్లయ్య, ఏపీఓ చంద్రకళ, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


ఓపీ కౌంటర్‌లో సిబ్బందిని హెచ్చరిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

## ఓపీకి.. యాప్‌తో లింకు పెట్టొద్దు

ఓపీ కౌంటర్ సిబ్బందికి సూపరింటెండెంట్ క్లాస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**అనంతపురం టౌన్, జనవరి 8:** జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఆయుష్మాన్ భారత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటేనే ఓపీ చీటీ రాసి ఇస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రోగులకు ఓపీ కష్టాలపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు స్పందించారు. సూపరింటెండెంట్ ఓపీ, అడ్మిషన్ కౌంటర్లను సంబంధిత విభాగాధికారి డాక్టర్ సౌజన్య కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీకి, ఆయుష్మాన్ భారత్ యాప్‌కు లింకు పెట్టడం ఏంటని ఓపీ కౌంటర్ సిబ్బందిని ప్రశ్నించారు. రోగులను ఇబ్బందులకు గురి చేసినట్లు ఇంకోసారి తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సౌజన్య కుమార్ మాట్లాడుతూ.. ఆధార్ ఉంటేనే అడ్మిషన్ అని రోగులను ఇబ్బంది పెట్టరాదని, వారు అడ్మిషన్ తర్వాత కావాలంటే ఆధార్ తెప్పించుకోవాలని, అప్పుడు కూడా ఆయుష్మాన్ భారత్ యాప్ తప్పనిసరి కాదని, రోగులకు సమస్యలు లేకుండా చూడాలని సూచించారు.

## రేపట్నుంచి న్యాక్ మాక్ కమిటీ పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రంగజనార్దన

**అనంతపురం సెంట్రల్, జనవరి 8:** నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు కోసం బుధవారం నుంచి మాక్ కమిటీ పర్యటిస్తుందని జేఎన్‌టీయూ వీసీ రంగజనార్దన తెలిపారు. సోమవారం నూతన పరిపాలనా భవనంలో కాన్ఫరెన్స్ హాల్లో మాక్ కమిటీ పర్యటనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ సాధిస్తే వర్సిటీ నాణ్యతా ప్రమాణాలను పెంపొందించుకోవచ్చన్నారు. కమిటీ పర్యటన వేళ బెరుకు, భయం లేకుండా మనవద్దనున్న పూర్తి సమాచారానిచ్చి వసతులు, సౌకర్యాల వివరాలతో పాటు అభివృద్ధిని వివరించేలా సన్నద్ధం చేయడానికి మాక్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. 10, 11న వర్సిటీలో మాక్ కమిటీ పర్యటించి పలు సూచనలు, సలహాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్లు, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూ పరిపాలన కార్యాలయం తరలింపు

జేఎన్‌టీయూ పరిపాలనా కార్యకలాపాలను నూతన పరిపాలన భవనంలోకి మార్చుతున్నారు. సోమవారం వీసీ రంగజనార్దన నూతన భవనంలోని చాంబర్ నుంచే విధులు నిర్వహించారు. రెక్టార్, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్, అకడమిక్ ఆడిట్, అడ్మిషన్, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రీయల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్స్, ఇండస్ట్రీయల్ కన్సల్టెన్సీ సర్వీసెస్, ఫారిన్ అఫైర్స్ అండ్ ఆలుమ్ని మ్యాటర్స్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ విభాగాలను ఇంకా తరలించాల్సివుంది. ఈ నూతన అకడమిక్ బ్లాక్‌ను శనివారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వర్చువల్‌గా ప్రారంభించారు.

## సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు ముగ్గురి ఎంపిక


తన్మయ్ కార్తీక్‌రెడ్డి, కిరణ్, సంజయ్

**అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 8:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు జిల్లాకు చెందిన తన్మయ్ కార్తీక్ రెడ్డి, కిరణ్, సంజయ్ క్రీడాకా రులు ఎంపికయ్యారు. బుధవా రం నుంచి గుంటూరులో నిర్వహించే అండర్-14 సౌత్‌జోన్‌స్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారు.

## నూతన కార్యవర్గానికి సన్మానం


నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న ప్రముఖులు

**అనంతపురం కల్చరల్, జనవరి 8:** ముషాయిక్ బోర్డు జిల్లా అధ్యక్షుడిగా రోషన్ జమీర్, ఉపాధ్యక్షుడిగా సలీంబాషా ఖాద్రి ఎన్నికైన నేపథ్యంలో సోమవారం స్థానిక ఆ బోర్డు కార్యాలయంలో వారిని పలువురు సన్మానించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఇన్చార్జి అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ.. ముషాయిక్ బోర్డు కేవలం ముస్లిం సామాజిక వర్గానికి చెందినది కాదని, అన్నివర్గాల వారికి సహాయ సహకారాలందించడమే ధ్యేయంగా బోర్డు పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో షైనుద్దీన్, అబ్బాస్ ఖాదిరి, సలీం షా ఖాదిరి, ఖాజా మొహిద్దీన్, గౌస్ మొహిద్దీన్, కరీముల్లా, ఆయతుల్లా, గౌసుల్లా, ఫజ్లుల్ బాషా, హిదయతుల్లా, కుతుబుద్దీన్, మహ్మద్ సుహేల్, అయానాబాషా, మహ్మద్ రఫీ, హమద్‌షా పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సరుకులు పంపిణీ చేసిన వలంటీర్


వలంటీర్ ఇంటి దగ్గర నుంచి సరుకులు తీసుకువెళ్తున్న మహిళ

**రాప్తాడు, జనవరి 8:** మండలంలోని రామినేపల్లి లో వలంటీర్ అశ్విని ఇంటి దగ్గర సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు సోమవారం కిట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు కొన్ని రోజుల నుంచి విధులు మానేసి ధర్నా చేపడుతున్నారు. అంగన్‌వాడీ బాధ్యతలను ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి అప్పగించింది. అందులో భాగంగా రామినేపల్లిలో వలంటీర్ ఇంటి వద్ద పౌష్టికాహారం పంపిణీ చేశారు.

## వడ్డెర్లను నట్టేట ముంచిన సీఎం జగన్‌రెడ్డి

జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ శ్రీలత



**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 8:** రాష్ట్రంలో ఉన్న 35 లక్షల మంది వడ్డెర్ల ను సీఎం జగన్‌రెడ్డి నమ్మించి నట్టేట ముంచారని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెంద్యాల శ్రీలత ధ్వజమెత్తారు. సోమవారం ఆమె ఆ పార్టీ కార్యాయలంలో ఆమె మాట్లాడుతూ.. వడ్డెర్లను దామాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ ఎస్టీ జాబితాలోకి చేర్చాలని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే తీరని అన్యాయం చేశాడని మండిపడ్డారు. ఇసుక కొరత, భవన నిర్మాణం దెబ్బతిని వడ్డెర్ల కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు రాష్ట్రంలో దాపురించాయన్నారు. అనంతరం పలువురు వడ్డెర కులస్థులు సమస్యల వినతి పత్రాన్ని పెంద్యాల శ్రీలతకు అందజేశారు. సమస్యలను అధినేత పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని శ్రీలత అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే సురేష్, ఉపాధ్యక్షులు నాగేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగుల ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పీట్ల ఆనంద్, సలహాదారులు మల్లెల కాశీం, సాకే నాగరాజు, సంపత్‌కుమార్, మహేష్, రామాంజనేయులు, కుంచపు లక్ష్మన్న, గోగుల వెంకటనారాయణ, కుమార్, ఎర్రిస్వామి, వంశీ, రామకృష్ణ, వీర మహిళలు పాల్గొన్నారు.



మాంటిస్సోరి స్కూల్‌లో చిన్నారుల వేషధారణ



మినర్వా స్కూల్ సంబరాల్లో పాల్గొన్న కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి


చర్చి స్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రాజమ్మ


రఘు సైనిక్ స్కూల్‌లో చిన్నారులకు భోగి పండ్లు వేస్తున్న సిబ్బంది

## స్కూళ్లలో ముందస్తు సంక్రాంతి సందడి


సాయి విజ్ఞాన్ స్కూల్‌లో భోగి మంటలు వేస్తున్న సిబ్బంది


సంక్రాంతి పతంగులతో ఆదర్శ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు

**అనంతపురం విద్య / కల్చరల్, జనవరి 8:** పాఠశాల విద్యాశాఖ ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకూ 10 రోజుల పాటు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. దీంతో పలు పాఠశాలల్లో సోమవారమే సంక్రాంతి సందడి కనిపించింది. నగరంలోని పలు స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు హాజరయ్యారు.పాఠశాల ఆవరణలు రంగు రంగుల ముగ్గులతో, భోగి మంటలతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూ రులో జరిగిన రాష్ట్రస్థాయి నంది నాటకోత్సవాల్లో నగరంలోని రామచంద్రనగర్‌లోని సెయింట్ అగస్టీన్ విద్యార్థులు బావికా బ్లెస్సీ, ఝాన్సీ, సుస్మిత, అరీబ, షఫియా సత్తా చాటారు. వారిని ఆ స్కూల్ కరస్పాండెంట్ రాజమ్మ నాటక రచయిత, దర్శకులు సుబ్రమణ్యం, గిరీష్ అభినందించారు.


హౌసింగ్ బోర్డులో శ్రీచైతన్య స్కూల్‌లో భోగి మంటలు వేస్తున్న ఏజీఎం, ఇతర సిబ్బంది


ద్వారకానగర్‌లోని నారాయణ పాఠశాలలో ముగ్గుల పోటీలు


గుత్తిలో జీఓ కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు


గుంతకల్లులో ..


ఉరవకొండలో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


యల్లనూరులో మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న దృశ్యం


యాడికిలో ఎస్మా ప్రతులను తగలబెడుతున్న అంగన్వాడీ కార్యకర్తలు


విడపనకల్లులో నిరాహార దీక్ష చేస్తున్న అంగన్వాడీలు


రాయదుర్గంలో పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు


బెళుగుప్పలో మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు

## బెదిరేది లేదు !

ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ప్రయోగించిన ఎస్మాకు భయపడేది లేదని అంగన్వాడీలు తేల్చి చెబుతున్నారు. డిమాండ్ల సాధనలో భాగంగా మండలకేంద్రాల్లో సోమవారం 28వ రోజు సమ్మె కొనసాగించారు. ప్రభుత్వ బెదిరింపులకు బెదిరేది లేదని, ఇలాంటి జీవోలు ఎన్ని విడుదల చేసినా తగ్గేది లేదని వారు హెచ్చరించారు. వీరికి పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్నెట్వర్క్


కళ్యాణదుర్గంలో 28 సంఖ్య ఆకారంలో కూర్చున్న అంగన్వాడీ కార్యకర్తలు


తాడిపత్రిలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు


బొమ్మనహాళ్లో అంగన్వాడీ వర్కర్ల దీక్షలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


కూడేరులో...


కుందుర్పిలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు


డీ.హిరేహాళ్లో నిరసన


గుమ్మఘట్టలో జీఓ కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు


సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు (యాడికి)

## మైనార్టీలను మోసగించిన జగన్: కాలవ


సెల్ఫీ దిగుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

**రాయదుర్గం, జనవరి 8:** నియోజకవర్గంలో జగన్ పాలనలో మైనార్టీల అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజ్లో భాగంగా డీ.హిరేహాళ్లో అర్ధంతరంగా ఆగిపోయిన షాదీమహల్ వద్ద సోమవారం ఆయన 39వ సెల్ఫీ దిగారు. టీడీపీ పాలనలో డీ.హిరేహాళ్ శివార్లలో రూ.30 లక్షలతో షాదీమహల్ నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. కణేకల్లు లో కూడా టీడీపీ హయాంలో ప్రారంభించిన భవన నిర్మాణం ఆగి పోయిందన్నారు. రాయదుర్గంలో దాదాపు రూ. 70 లక్షలతో నిర్మించ తల పెట్టిన షాదీమహల్ నిర్మాణం భూమిపూజకే పరిమితమైందని విమర్శించారు. మైనార్టీ ఓట్లు దండుకొని గద్దెనెక్కిన జగన్రెడ్డి ముస్లింలకు తీరని అన్యాయం చేస్తున్నాడన్నారు. కెంచానపల్లి గ్రామంలో షాదీమహల్ నిర్మాణాన్ని పూర్తి చేసి, నియోజకవర్గ వ్యాప్తంగా మసీదుల్లో మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన మైనార్టీల ప్రగతి పనులు మళ్లీ చంద్రబాబు పాలనతోనే ముందుకు సాగుతాయన్నారు.

## అసమర్థ జగన్ను ఇంటికి సాగనంపుదాం: ఉన్నం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

**కళ్యాణదుర్గం, జనవరి 8:** రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇటువంటి అసమర్థ ముఖ్యమంత్రి జగన్ను ఇంటికి సాగనంపుదామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి తెలిపారు. సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని 4వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ టీడీపీ ప్రకటించిన సూపర్సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, రామాంజినేయులు, గొల్ల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.


## సంచార జాతులకు రిజర్వేషన్ కల్పించాలి

**గుంతకల్లుటౌన్, జనవరి 8:** సంచార జాతులకు రాష్ట్ర పరిధిలో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో పది శాతం రిజర్వేషన్ కల్పించాలని సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం సంచార జాతుల బహిరంగ సభను నిర్వహించారు. సంచార జాతుల సంఘం నాయకులు ర్యాలీగా సభ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జాతులను రాజ్యాంగ బద్ధంగా కులాలుగా, జాతులుగా గుర్తించాలన్నారు. ఎంబీసీ కార్పొరేషన్కు నిధులు కేటాయించాలి, నామినేటెడ్ పోస్టులలో అవకాశాలను కల్పించాలన్నారు. సంచార జాతులకు నిబంధనలు లేకుండా నవదోయ, గురుకులాలు, మోడల్ స్కూల్స్లలో పది శాతం రిజర్వేషన్తో ఉచిత రెసిడెన్షియల్ నిర్బంధ విద్యను అందించాలన్నారు. సంచార జాతుల కళాకారులకు రూ. 5వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జోగి సంఘం నాయకులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్, బాల సంతసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కుల్లాయప్ప, మహిళా అధ్యక్షురాలు ఇంద్రదేవి, వంశరాజ్ సంఘం నాయకులు ఉలిగప్ప, సుబ్బయ్య, తోలుబొమ్మలాట అధ్యక్షులు మల్లికార్జున, గోసంగి, బుడబుక్కల సంఘం అధ్యక్షులు దౌలప్ప, మల్లికార్జున, కౌన్సిలర్ వెంకటేష్, నాయకులు అంజి, హనమంతు, మద్దిలేటి పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లిస్తేనే సమ్మె విరమిస్తాం

**కణేకల్లు, జనవరి 8:** తమకు రావాల్సిన బకాయిలు చెల్లిస్తేనే సమ్మె విరమిస్తామని శ్రీరామిరెడ్డి కార్మికులు తేల్చి చెప్పారు. గత ఎనిమిది రోజులుగా శ్రీరామిరెడ్డి కార్మికులు సమ్మె చేస్తుండటంతో ఆర్డబ్ల్యుఎస్ ఈఈ జవహర్లాల్, డీఈ శ్రీనివాసులు, జేఈ లావణ్యలు కార్మికులతో చర్చలకు వచ్చారు. దీంతో వారు మాట్లాడుతూ తమకు ఐదునెలల జీతాలు, బకాయిపడ్డ పీఎఫ్ ఖాతాలోకి జమ అయితేనే విధుల్లోకి వస్తామని లేకపోతే రామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నాగమణి, నాయకులు దామోదర్, వన్నూరుస్వామి, రామాంజినేయులు, సంజప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే అభివృద్ధి: అశ్మిత్రెడ్డి


చిరువ్యాపారితో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్రెడ్డి

**తాడిపత్రి, జనవరి8:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ ఇన్చార్జ్ జేసీ అశ్మిత్రెడ్డి తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబాభవానీవీధి, శాస్త్రినగర్, కేవీరెడ్డి నగర్లో సోమవారం జేసీ అశ్మిత్రెడ్డి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని, మీరందరూ కలిసికట్టుగా టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

# మైనార్టీల భవనాలను ప్రారంభించకపోవడం దారుణం

- శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్


అర్ధంతరంగా నిలిచిపోయిన ఉర్దూ పాఠశాల భవనాన్ని సందర్శించిన ఎంఏ షరీఫ్, తదితరులు

**గుంతకల్లు, జనవరి8:** పట్టణంలో టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన ఉర్దూ కళాశాల, బాల, బాలికల హాస్టలు భవనాలను వైసీపీ ప్రభుత్వం ప్రారంభించకపోవడం దారుణమని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ విమర్శించారు. సోమవారం ఉదయం పట్టణంలో పూర్తయిన, అర్ధతరంగా నిచిపోయిన మైనార్టీ భవనాలను ఆయన మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు, టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జితేంద్రగౌడు మాట్లాడుతూ భవనాల ప్రారంభాన్ని వైసీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. దాదాపు రూ.11 కోట్లు ఖర్చుచేసి నిర్మించిన ఉర్దూ హాస్టలు భవనంలో ఆర్డీవో కార్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. కళాశాల భవనాన్ని కూడా బీసీ హాస్టలుగా మార్చాలని చూశారని విమర్శించారు. కళాశాల, హాస్టలు భవనాలను ప్రారంభించకుండా, నిర్మాణం అర్ధంతరంగా నిలిచిన ఉర్దూ పాఠశాల భవనాన్ని పూర్తిచేయకుండా ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం చేసిందన్నారు.

## ఐకమత్యంతో పోరాడి టీడీపీని గెలిపిద్దాం: జేసీ


నాయకులతో మాట్లాడుతున్న జేసీ దివాకర్రెడ్డి

**యాడికి, జనవరి8:** నాయకులంతా ఐకమత్యంతో పోరాడి టీడీపీని గెలిపించుకుందామని మాజీ ఎంపీ జేసీ దివాకర్రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రాయలచెరువు గ్రామంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పలువురు సీనియర్ నాయకులను కలిశారు. మాజీ ఎంపీపీ రామాంజనేయులు, మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్, చక్రపాణి, వై. రాజా, ఇంటూరు ప్రసాద్, భీమలింగప్ప, కరుణాకర్, శంకరప్ప, తలారి రాముడు, ఆర్పీ సుధాకర్, రంజిత్ కుమార్, జయరాములు, మాజీ ఎంపీటీసీ మురళీ, అమిలినేని శ్రీధర్, బాబుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, మాదాల గోపాల్ తదితరుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అతలాకుతలమైందని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు చవ్వా గోపాల్రెడ్డి, వేలూరు రంగయ్య, అమిలినేని సత్య, ఆదినారాయణ, చలమారెడ్డి, మదమంచి శివ, రవికుమార్రెడ్డి, లక్ష్మణ్, విక్రమ్ ఉన్నారు.

## రాష్ట్రంలో అరాచక పాలన: టీడీపీ


గాయపడిన రైతును పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

**ఉరవకొండ, జనవరి8:** రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని టీడీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని రోడ్లు భవనాల వసతి గృహంలో వైసీపీ నాయకులు దాడిలో గాయపడిన దళిత రైతును టీడీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. దళిత రైతు రామాంజనేయులుపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, రామాంజినేయులు, ప్రసాద్నాయక్ పాల్గొన్నారు.

### కేశవ్ను విమర్శించే స్థాయి ప్రణయ్కు లేదు

కేశవ్ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్కు లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని రోడ్లు భవనాల వసతి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు ఏళ్లలో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా 2024లో చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు.

## చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

**కళ్యాణదుర్గం, జనవరి 8:** బైక్ చోరీ కేసులో ఇద్దరికి కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టు ఆరునెలల జైలు శిక్ష విధించినట్లు సీఐ హరినాథ్ సోమవారం విలేకర్లకు తెలిపారు. 2023, జనవరి 24 న కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రామాంజినేయులు తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఆర్డీటీ ఆసుపత్రికి ద్విచక్రవాహనంలో వచ్చారు. ద్విచక్రవాహనాన్ని ఆసుపత్రి బయట వదిలి దంపతులు చికిత్స కోసం లోపలికి వెళ్లారు. కాసేపటి తర్వాత భార్యభర్తలిద్దరూ బయటకు వచ్చి చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. చోరీ అయినట్లు నిర్ధారించుకుని పట్టణ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బైకు చోరీ చేసిన నిందితులు అనంతపురానికి చెందిన సద్దాంహుస్సేన్, గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాంకు చెందిన బలిజ రాజశేఖర్గా పోలీసులు గుర్తించారు. వీరు కొన్ని నెలల క్రితం అనంతపురం పోలీసులకు దొరికారు. విచారణ చేపట్టిన పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. సోమవారం కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టులో ఈ ఇద్దరి దొంగలను హాజరు పరిచారు. ఈ కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయాధికారి జైలు శిక్షను విధించారు.

## మహిళ ఆత్మహత్య


ఆదిలక్ష్మి(ఫైల్)

**గుంతకల్లుటౌన్, జనవరి 8:** పట్టణంలోని వాల్మీకి నగర్లో నివాసముంటున్న ఆదిలక్ష్మి(24) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్ రాజుతో కర్ణాటక రాష్ట్రం రూపన్గుడి మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మికి ఏడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. రాజు సెల్ ఫోన్ షాపు నడుపుతున్నాడు. మధ్యాహ్నం రాజు దుకాణానికి వెళ్లగా ఆదిలక్ష్మి ఇంట్లో ఫ్యాన్కు ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత పార్సిల్ తీసుకునేందుకు రాజు ఇంటికి రాగా తలుపులు వేసి ఉన్నాయన్నారు. తట్టిన తెరవకపోవడంతో తలుపులను బద్దలు కొట్టి లోపలకి వెళ్లాడు. ఉరికి వేలాడుతూ కనిపించిన ఆదిలక్ష్మిని కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు తెలిపారు. పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఆదిలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుంద న్నారు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● పట్టణంలోని మహబుబ్నగర్ కాలనీలో నివాసముంటున్న నాగవేణి(45) సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సమస్యలతో ఇంట్లో నే విషద్రావం తాగింది. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. మృతిరాలికి భర్త రాజు, ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి

**తాడిపత్రిటౌన్:** మండలంలోని ఆటోనగర్ సమీపంలో సోమవారం 50సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

## పింఛన్ సొమ్ములో కోత

**బ్రహ్మసముద్రం, జనవరి 8:** మండలంలోని బొమ్మగానిపల్లిలో ప్రభుత్వం పెంచిన పెన్షన్లను సోమవారం సాయంత్రం పంపిణీ చేశారు. ఈ గ్రామంలో 240 దాకా పెన్షన్లు ఉన్నాయి. సోమవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శి కవిత పింఛన్ల సొమ్మును ఆ గ్రామ వలంటీర్లకు అందచేశారు. ఇంటింటికి తిరుగుతూ వలంటీర్లు 50 మంది లబ్ధిదారులకు రూ.3000లు పంపిణీ చేశారు. అయితే ఐదుగురి లబ్ధిదారులతో రూ. 200లు ఇంటిపన్నుకు కావాలంటూ కోత విధిస్తూ వలంటీర్లు పంపిణీ చేశారు. అయితే గోవిందప్ప అనే లబ్ధిదారుడు తనకు రూ. 2800 ఇచ్చి, రూ. 200 లు కోత విధించారని ఆవేదన వెళ్లిబుచ్చుతూ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి కవిత భయపడి వెంటనే లబ్ధిదారులకు కోత విధించిన డబ్బును వెనక్కి ఇచ్చేశారు.

## ఓపీఎస్ను పునరుద్ధరించాలి


గుత్తిలో రిలే దీక్షలు చేపట్టిన రైల్వే ఉద్యోగులు

**గుంతకల్లు, జనవరి8:** కేంద్ర ప్రభుత్వోద్యోగులకు నూతన పెన్షన్ పద్ధతిని రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. గుంతకల్లు రైల్వే పరిధిలో ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఓపీఎస్ పునరుద్ధరణకు ధర్నాలు నిర్వహించారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంతోపాటు వివిధ బ్రాంచ్ల వద్ద సంఘ్ నాయకులు శిబిరాలను ఏర్పాటుచేసి ఆందోళన చేపట్టారు. ఆందోళనా కార్యక్రమంలో మల్లికార్జున, జీఎన్ ప్రకాశ్బాబు, నాగమణి, టీ కృష్ణ, బీఎస్ ప్రకాశ్బాబు, బీ నెట్టికంటయ్య, చంద్రశేఖరరావు, మహమ్మద్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి:** నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద సౌత్సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి సుభాష్ బాబు, కుళ్లాయప్ప, రాజశేఖర్రెడ్డి, నారాయణ, సుధాకర్, కృష్ణమోహన్లు దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## పాత్రికేయులపై దాడి అప్రజాస్వామికం


ఉరవకొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**పామిడి:** ఉరవకొండలో సామాజిక బస్సుయాత్రలో వైసీపీ నాయకులు పాత్రికేయులుపై ఆదివారం దాడి చేయడం అప్రజాస్వామికమని పామిడి పాత్రికేయులు ఖండించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సునీతబాయికి వినతి పత్రం అందజేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలి

**ఉరవకొండ:** సామాజిక సాధికార బస్సు యాత్రలో కవరేజ్కు వెళ్లిన ప్రముఖ దినపత్రికకు చెందిన రిపోర్టర్లపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. విలేకర్లపై దాడికి నిరసనగా స్థానిక కవితా హోటల్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అంతకు మునుపు పార్టీ కార్యాలయం నుంచి టవర్క్లాక్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతపురం- గుంతకల్లు రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ విలేకర్లపై దాడికి పాల్పడం పిరికి పంద చర్య అన్నారు. వాస్తవాలను రాస్తున్నందుకు వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక దాడులకు పాల్పడి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం టీడీపీ నాయకులు ర్యాలీగా వెళ్లి పోలీసు స్టేషన్లో వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే విలేకర్లపై దాడి సంఘటనపై సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా ఖండించారు.

## ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**యల్లనూరు, జనవరి8:** మండలంలోని శింగవరం గ్రామ సమీపంలో సోమవారం ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వారి నుంచి రూ.3600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి ముగ్గురిని అరెస్టుచేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రేపు డయల్యువర్ డీఎం

**తాడిపత్రిటౌన్, జనవరి 8:** స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు 9959225856 నెంబర్కు ఫోన్చేసి సలహాలు, సూచనలను తెలపాలని ఆయన కోరారు.

## జీడిపల్లికి 311 క్యూసెక్కుల ఇన్ఫ్లో

**బెళుగుప్ప, జనవరి 8:** మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 311 క్యూసెక్కుల ఇన్ఫ్లో, 600 క్యూసెక్కుల ఔట్ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం వెల్లడించారు. రిజర్వాయరులో ప్రస్తుతం 0.687 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

## కంది పంట క్షేత్ర దినోత్సవం

**గుత్తిరూరల్ జనవరి 8:** మండలంలోని కరిడికొండ గ్రామంలో సోమవారం కంది పంట క్షేత్ర దినోత్సవాన్ని ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్ నిర్వహించారు. జాతీయ భద్రత ఆహార మిషన్ వారిచే క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కంది పంట దిగుబడులు సరిగా లేవన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో మేలు రకం విత్తనం రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ల బైండోవర్

**పుట్లూరు, జనవరి8:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ దిలీప్కుమార్ సోమవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామాల్లో నిఘా పెట్టామన్నారు. అనంతరం శనగలగూడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ఈవ్టీజింగ్ గురించి వివరించారు.

## రేషన్ కోసం ఆందోళన

**ఉరవకొండ, జనవరి8:** రేషన్ బియ్యంను సక్రమంగా పంపిణీ చేయడం లేదని మహిళలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఐదు నెలల నుంచి రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. బియ్యం వాహనాలు తమ వీధుల్లోకి రావడం లేదని, రెగ్యులర్ డీలర్ లేకపోవడం వల్ల ఎక్కడ బియ్యం వేయించుకోవాలో తెలియడం లేదన్నారు. 5 నెలలుగా కంది పప్పు వేయడం లేదన్నారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని తహసీల్దారు వారికి హామీ ఇచ్చారు.

## షెడ్ల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

**రాయదుర్గంరూరల్, జనవరి 8:** పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల పశువైద్యులు వీరేష సూర్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి రెండు పశువులకు రూ.లక్ష, నాలుగు పశువులకు రూ. 1.5 లక్షలు, ఆరు పశువులకు రూ.1.8 లక్షలు కేటాయించిందన్నారు. రైతుకి ఐదు ఎకరాల లోపు భూమి ఉండాలన్నారు. వివరాలకు 6304353196 నెంబర్ను సంప్రదించాలన్నారు.

## అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

**బెళుగుప్ప, జనవరి 8:** అర్హులందరికీ ఇళ్ల పట్టాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఓబుళేసు తెలిపారు. బెళుగుప్ప ఎస్సీ కాలనీవాసులు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని శనివారం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం స్పందనకు కాలనీ మహిళల పెద్దఎత్తున తరలి వచ్చి వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా కోరుతున్నా సమస్య పరిష్కరించడం లేదని టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున శివ, రాము, తిప్పేస్వామి, వెంకటేశులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. విచారించి అర్హులందరికీ పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలపడంతో కాలనీవాసులు వెనుదిరిగారు.

## నేడు ముస్లింల ఆత్మీయ సదస్సు

**రాయదుర్గం, జనవరి 8:** ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడానికి మంగళవారం రాయదుర్గంలో ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో ఆశలు కల్పించి, ఎన్నికల్లో గెలిచాక వైఎస్ జగన్మోహన్రెడ్డి మైనార్టీలను దగా చేస్తున్నాడన్నారు. నాలుగున్నరేళ్ల నుంచి ముస్లింలకు జరుగుతున్న అన్యాయాలపై మైనార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామన్నారు. పట్టణంలో అజీజీయా షాది మహల్లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు బళ్లారిరోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి షాదీమహల్ వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. శాసనమండలి మాజీ మాజీ చైర్మన్మహమ్మద్ షరీఫ్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.